క్లుప్తంగా

సంప్రదాయబద్ధంగా మల్లమ్మ జయంత్యుత్సవం



పూజల్లో పాల్గొన్న దేవస్థాన ఈఓ ఎస్.లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మల్లికార్జున స్వామివారి పరమ భక్తుల్లో ఒకరైన మల్లమ్మ జయంతి ఉత్సవం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం గోశాల సమీపంలోని హేమారెడ్డి మల్లమ్మ (మల్లమ్మ కన్నీరు) మందిరంలో ఉత్సవ పూజలు చేపట్టారు. కార్యక్రమంలో మల్లమ్మకు పంచామృతాభిషేకం, జలాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. ముందుగా జయంత్యోత్సవ సంకల్పం పఠించి, కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతి పూజ చేపట్టారు. చివరిగా మల్లమ్మను స్తుతిస్తూ పలు భక్తి గీతాలు ఆలపించారు. కార్యక్రమాల్లో శ్రీశైల దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి ఎం.హరిదాసు, స్వామివారి ఆలయ ప్రధానార్చకులు హెచ్.వీరయ్యస్వామి, అర్చకులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా రాక

బండిఆత్మకూరు: మండలంలోని ఎ.కోడూరు గ్రామంలో శనివారం నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొనేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి వస్తున్నారని ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి శుక్రవారం తెలిపారు. మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు హాజరు కావాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో కలశారాధన



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠ మహోత్సవ పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శుక్రవారం పురోహితులు కలశారాధన చేపట్టారు. ఉదయం సుప్రభాతం, వేదపారాయణ, ద్వారా తోరణం, కలశారాధన, ప్రధాన దేవతా ఆరాధన పూజలు చేశారు. ఈ నెల 6వ తేదీ సుప్రభాతం, తిరుప్పావై పఠనం, ద్వారా తోరణ పూజ తదితర కార్యక్రమాలు ఉంటాయని, 7న నూతన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ చైర్మన్ బళ్లాని వెంకట సత్యనారాయణ తెలిపారు.

చేతిపంపులకు మరమ్మతులు

పాములపాడు: గ్రామంలో ప్రజలకు నీటి సమస్యలు ఎదురుకాకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచు వరప్రసాద్ తెలిపారు. మండలంలోని తుమ్మలూరు గ్రామంలో శుక్రవారం చేతి పంపుల మరమ్మతులు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో చేతి పంపులు పనిచేడం లేదని స్థానికుల ఫిర్యాదుతో జెడ్పీటీసీ జ్యోతి రామలింగేశ్వరరెడ్డి సహకారంతో మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు.

పాఠ్యపుస్తకాల మంజూరు



పాఠ్యపుస్తకాలను ఎంఈఓ కార్యాలయంలో సర్దుతున్న సీఆర్పీలు

జూపాడుబంగ్లా: 2023–24 విద్యా సంవత్సరానికి గాను మండలంలోని 5,628 మంది విద్యార్థులకు సరిపడ మొదటి విడతలో భాగంగా 14,487 పాఠ్యపుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు 4,628మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి మూడు జతల చొప్పున యూనిఫాం, 3,829 మంది విద్యార్థులకు స్టీల్ గ్లాసులు వచ్చాయని చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభం అయ్యేలోపు పాఠ్య, నోట్‌పుస్తకాలు, బెల్టులు వస్తాయన్నారు. పాఠశాలలు తెరచిన మొదటి వారంలోనే విద్యార్థులకు జగనన్న కానుకను విద్యార్థులకు అందజేస్తామని పేర్కొన్నారు.

కారల్ మార్క్స్ జయంతి

ఆత్మకూరురూరల్: సమతా సిద్ధాంతకర్త, జర్మన్ తత్వవేత్త కారల్ మార్క్స్ 205వ జయంతిని పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. పార్టీ తాలూకా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్మికవర్గం – పెట్టుబడిదారి ధృక్పథం వంటి అంశాలను విశ్లేషిస్తు దాస్ కేపిటల్ గ్రంథం రచించారన్నారు. 1847లో ఫ్రెడరిక్ ఏంజెల్, కార్ల్ చాపర్‌తో కలిసి కమ్యూనిస్టు లీగ్ ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. నాయకులు అహమ్మద్ హుసేన్, చాంద్ బాషా పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నందికొట్కూరు: మండలంలోని శాతనకోట గ్రామ వైఎస్సార్ హెల్త్ సెంటర్‌లో సర్పంచు జనార్ధన్ గౌడు ఆధ్వర్యంలో శాంతిరామ్ లేజర్ కంటి వైద్యశాల వైద్యుల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు చిన్మయి, ఏఆర్ వెంకటేష్, ఓపి భరత్, సిబ్బంది పాల్గొన్నారు.

పదునెక్కిన భూములు

- వరుసగా కురుస్తున్న వర్షాలు
- నియోజకవర్గంలో ఆశాజనకంగా వానలు
- ముమ్మరంగా వ్యవసాయ పనులు



నందికొట్కూరు వద్ద గత పంట వ్యర్థాలను తగలబెడుతున్న వ్యవసాయ కూలీలు

నందికొట్కూరు: ఇటీవల వరుసగా కురుస్తున్న వర్షాలకు పొలాలు పదునెక్కాయి. ఖరీఫ్ సీజన్ త్వరలో ప్రారంభం కానుండటంతో ఇప్పటికే అన్నదాతలు ఎండకారు దుక్కులు చేస్తున్నారు. ప్రస్తుతం గత పంటల అవశేషాలు తొలగించి తగలబెట్టడం, వేసవి దుక్కుల్లో రైతులు బిజీగా ఉన్నారు. కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. సాధారణంగా మే నెలలో ఎండలు అధికంగా ఉండటంతో పాటు నీటి వనరులు అడుగంటి పోయి, వృక్షాలు ఎండిపోయి ఉంటాయి. అయితే ఈ ఏడాది అకాల వర్షాల కారణంగా వాగులు, వంకల్లో నీరు ప్రవహిస్తోంది. ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టగా చెట్లు పచ్చగా కళకళలాడుతున్నాయి.

జోరుగా వ్యవసాయ పనులు..

నియోజకవర్గంలో ఏప్రిల్ చివరి వారం నుంచి మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మే ప్రారంభంలోనే వర్షాలు కురవడంతో రైతన్నల్లో ఆశలు రేకెత్తుతున్నాయి. అలాగే వర్షాలకు భూములు పదునెక్కాయి. ఇక ఖరీఫ్ పంట సాగుకు పొలాలను సిద్ధం చేయడంలో భాగంగా పొలాల్లో ఎరువులు చల్లడం, గత పంట వ్యర్థాల తొలగింపు, లోతు దుక్కులు చేస్తున్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త విజయశేఖర్, ఏడీఏ నందికొట్కూరు

అదును, పదును ఒకే సారి వచ్చినట్లయితే రైతులు విత్తనాల కోసం ఒక్కసారిగా ఎగబడవచ్చు. ఇదే అదనుగా విత్తనాల డీలర్లు నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రమాదముంది. ఈ నేపథ్యంలో రైతులు నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన తరువాత తప్పని సరిగా బిల్లు, విత్తనాల సంచిని భద్రపరుచుకోవాలి. లోతు దుక్కులు చేసుకోవడంతో పాటు సేంద్రియ ఎరువులు చల్లడం, గొర్రెలు, మేకలు ఆపితే పొలాల్లో కర్బన శాతం పెరిగి సారవంతంగా మారతాయి.



నందికొట్కూరు సమీపంలో భూమిని దున్నుతున్న దృశ్యం

వైభవంగా సుంకులమ్మ జాతర



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న భక్తులు



ఉత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: స్థానిక ఈశ్వర్‌నగర్ కాలనీలో కొలువైన శ్రీ సుంకులా పరమేశ్వరి జాతర 12 ఏళ్ల తర్వాత అత్యంత వైభవంగా నిర్వహించారు. కులమతాలకు అతీతంగా భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈశ్వర్‌నగర్, పార్వతీపురం కాలనీలతో పాటు వివిధ గ్రామాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు డప్పువాయిద్యాల నడుమ బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి వేడుకలకు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. మహానంది దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈఓ ఎర్రమల మధు, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, సర్పంచ్ చలం చలం శిరీష, ఎంపీటీసీ దైవందిన్నె వెంకటేశ్వర్లు, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, మాజీ సర్పంచ్ జయసింహారెడ్డి, నాయకులు ఒంటెద్దు వీరారెడ్డి, కొండా మధుసూదన్‌రెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శరభారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ కామేశ్వరరెడ్డి, భూమా సుబ్బరామయ్య, మనోహర్‌రెడ్డి, మాజీ ధర్మకర్త బండి శ్రీనివాసులు పాల్గొన్నారు.

అలాగే..మహానంది దేవస్థానం ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ కుమారుడు మణిదీప్‌శర్మ వివాహానికి ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి, భువనేశ్వరరెడ్డి, ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ మహేశ్వరరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

నేడు డయల్ యువర్ డీఎం

నందికొట్కూరు: స్థానిక ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉదయం 11. 30 నుంచి 12. 30 గంటలకు వరకు సెల్ 99592 25799 నంబరుకు ఫోన్ చేసి ప్రయాణికులు, ప్రజలు తమ సమస్యలు, సూచనలు తెలియజేయాలన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

12న సర్వసభ్య సమావేశం

పాములపాడు: ఈ నెల 12వ తేదీన స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ సభ్యులు, అన్ని గ్రామాల సర్పంచు లు, ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాలని కోరారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ఆయా శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో సమావేశానికి రావాలని సూచించారు.

'ఉపాధి' వేతనం పెంచాలి

బండిఆత్మకూరు: ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు కేరళ రాష్ట్రం తరహాలో రూ.400 ప్రకారం వేతనం ఇవ్వాలని సీపీఎం నాయకులు రత్నమయ్య, రామచంద్రుడు కోరారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం కూలీలకు కనీసం రూ.200 వేతనం కూడా లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో లాగా వేసవి కాలంలో మజ్జిగ పంపిణీ చేయడం లేదని, కూలీలకు పనిముట్లు అందజేయడం లేదని చెప్పారు.

దరఖాస్తు చేసుకోండి

పాములపాడు: మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ బాలాజీనాయక్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎమ్మార్సీలో మాట్లాడారు.

పగిడ్యాల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ సుజనకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సవంత్సరంలో ఆరో తరగతి చేరేందుకు నోటిఫికేషన్ జారీ చేశారని మండలంలోని ఆసక్తి కలిగిన విద్యార్థులు httpr://apmr.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 9 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 75, ఓసీ, బీసీ అభ్యర్థులు రూ. 150 రుసుము చెల్లించాలన్నారు.

జూపాడుబంగ్లా: మోడల్ పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతిలో చేరదలచిన విద్యార్థులు ఈనెల 25 తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ శుక్రవారం తెలిపారు.

ఉపాధి కూలీ మృతి

నందికొట్కూరు: ఉపాధి పనుల్లో పాల్గొన్న మహిళా కూలీ అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందిందని ఏపీఓ అలివేలమ్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని అల్లూరు గ్రామానికి చెందిన కూలీ కాటేపోగు శ్యామలమ్మ (45) ఉపాధి హామీ పథకం పని చేస్తుండగా ఆకస్మత్తుగా కుప్పకూలింది. దీంతో తోటి కూలీలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్ కవిత, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, పంచాయితీ కార్యదర్శి చంద్రశేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మహానంది: గాజులపల్లె పెద్దమ్మ జాతరకు వచ్చిన ఇద్దరు దంపతులు తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ఆటో అడ్డుగా రావడంతో బైక్‌పై నుంచి కింద పడి ఇద్దరికీ గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఉత్సవాల్లో పాల్గొన్ని ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన విజయలక్ష్మి, కుటుంబ సభ్యులు వెళ్తుండగా గాజులపల్లె మెట్ట మలుపు వద్ద ఆటో ఢీకొంది.

రైతులు సహకరించాలి

కొత్తపల్లి: గోకవరం గ్రామ పంచాయతీ పరిధిలోని పుల్లారెడ్డి చెరువుకు సంబంధించి పంట కాల్వల నిర్మాణానికి రైతులు సహకరించాలని ఆర్డీఓ దాసు కోరారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చెరువు నిర్మాణం పూర్తయినా పొలాలకు సాగునీరు అందడం లేదన్నారు. కాలవ్వల నిర్మాణాలకు సుమారు 17 ఎకరాల భూమి అవసరమవుతుందన్నారు. కాగా ఎకరాకు రూ.15 లక్షలు పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. అయితే ప్రభుత్వం మాత్రం పుల్లారెడ్డి ట్రస్టు ద్వారా రూ.8 లక్షల వరకు ఇచ్చే అవకాశముందని ఆర్డీఓ చెప్పారు.

సద్వినియోగం చేసుకోండి

పగిడ్యాల: ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటవ తరగతిలో చేరేందుకు కల్పించిన ఉచిత విద్య అవకాశాన్ని గ్రామీణ విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ సుభాన్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. 2023–24 విద్యా సవంత్సరానికి ప్రైవేట్ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరేందుకు రెండవ విడుత దరఖాస్తుకు ఈనెల 6 నుంచి 15వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు ఉచితంగా కేటాయిస్తారన్నారు.

కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయొద్దు

జూపాడుబంగ్లా: కంటి జబ్బులను నిర్లక్ష్యం చేయరాదని ఏలూరు జిల్లా ఆప్తాల్మిక్ వైద్యురాలు డాక్టర్ ప్రభ తెలిపారు. శుక్రవారం మండలంలోని తూడిచెర్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనంతరం గ్రామస్తులకు కంటి పరీక్షలకు చికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. సర్పంచ్ బాలమద్దిలేటి, ఫాదర్ రాజేష్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్

మిడుతూరు: యువత క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీ లక్ష్మీ చెన్న కేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 40 కబడ్డీ జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, నాయకులు రామనాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

మహానందీశ్వరుడికి పల్లకోత్సవం

మహానంది: మహానందీశ్వరస్వామి దంపతులు శుక్రవారం రాత్రి పల్లకీలో విహరించారు. ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి అలంకార మండపంలో శాస్త్రోక్త పూజల అనంతరం పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు.



పెద్దకొట్టాల ఎద్దుల విజయకేతనం



పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన న్యూ కేటగిరి రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల విజేతగా నంద్యాల జిల్లా పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50 వేలు సొంతం చేసుకున్నాయి. అంతకుముందు జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, నందికొట్కూరు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి పోటీలను ప్రారంభించారు. కర్ణాటక రాష్ట్రం ఫల్కాదొడ్డి గ్రామానికి చెందిన ఖాజాహుసేన్ ఎద్దులు రెండో స్థానంలో నిలిచి రూ. 40 వేలు, నంద్యాల జిల్లా కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు మూడో స్థానంలో నిలిచి 30 వేలు, నంద్యాల జిల్లా, బేతంచెర్ల మండలం టి. హుసేనాపురం గ్రామానికి చెందిన ఎం రామసుబ్బారెడ్డి ఎద్దులు నాల్గో స్థానంలో నిలిచి రూ. 20 వేలు, పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన నాగార్జున ఎద్దులు ఐదో స్థానంలో నిలిచి రూ. 15 వేలు, గడివేముల మండలం కె. బొల్లవరం గ్రామానికి చెందిన బి. వెంకటరమణ యాదవ్ వృషభాలు ఆరో స్థానంలో నిలిచి రూ. 10వేలు, ప్రకాశం జిల్లా పెద్దరవడు గ్రామానికి చెందిన అల్లు రేవంత్ రెడ్డి ఎద్దులు ఏడో స్థానంలో నిలిచి రూ. 5 వేల నగదు బహుమతులను అందుకున్నాయి.

అభివృద్ధి కార్యక్రమాలపై చర్చ

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చర్చించారు. శుక్రవారం శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి శిఖరేశ్వరం వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం శ్రీశైలంలోని భ్రమరాంబా అతిథి గృహానికి చేరుకుని మంత్రితో భేటి అయ్యారు. క్షేత్ర అభివృద్ధి, భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న మాస్టర్‌ప్లాన్, నెల 25వ తేదీ నుంచి జరుగనున్న మహాకుంభాభిషేకం ఏర్పాట్లపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి ఎంఏ. రజాక్, టీఎండీ.రఫి, దుర్గాప్రసాద్, ఏడుకొండలు, కుమార్, నటరాజ్, విష్ణు, శ్రీశైలం సచివాలయం కన్వీనర్ జిల్లెల లక్ష్మీదేవి, ప్రభావతి, కోటమ్మ, అంజలి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక సంగీతం



భక్తిగీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆలయ దక్షిణ మాఢవీధిలో నిత్య కళావేదికపై చిత్తూరుకు చెందిన బి.వి.పద్మనాభం వారు నిర్వహించిన కర్ణాటక సంగీతం భక్తులను అలరించింది. కార్యక్రమంలో వాతాపీ గణపతిం, శంభో శివశంభో, శ్రీశైలవాసా తదితర గీతాలను ఆలాపించారు. డోలు సహకారం బి.వి.పద్మనాభం, మునిరత్నం, నాదస్వర సహకారాన్ని టి.బాలు, రామకృష్ణ అందించారు.

చిరుధాన్యాల సాగు చేపట్టాలి



మాట్లాడుతున్న వ్యవసాయ ఏఈఓ శ్రీనివాసరెడ్డి

మహానంది: చిరుధాన్యాల సాగు వైపు రైతులు మొగ్గు చూపాలని మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. తమ్మడపల్లె రైతుభరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహామండలి సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ జొన్న, రాగి, సజ్జ, అండుకొర్రలులో పోషకాలు, ఐరన్ ఉంటాయన్నారు. వీటిని తరచూ తీసుకోవడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందని చెప్పారు. తక్కువ పెట్టుబడి,నీరు, కాలపరిమితితో వీటిని సాగు చేయవచ్చన్నారు. అలాగే ఈ పంటలను చీడపీడలు తక్కువగా ఆశిస్తాయని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని చెప్పారు. ఉపసర్పంచ్ కొమ్మా ప్రతాప్‌రెడ్డి, ఏఈఓ శ్రీనివాసరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: రైతాంగం చిరుధాన్యాలను సాగు చేయడం వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి స్వాతి తెలిపారు. మండలంలోని ఈర్నపాడు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వ్యవసాయ సలహా మండలి సమావేశంలో పాల్గొని పంట మార్పిడి వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. పిల్లిపెసర, మినుము తదితర పంటలు సాగు చేయడం వల్ల భూమి సారవంతమౌతుందని చెప్పారు.

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు



పాత ముచ్చుమర్రిలోని జంబులాపరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠకు తరలివచ్చిన భక్తులు



సంకిరేణిపల్లెలో సుంకులమ్మ దేవాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న దృశ్యం

పగిడ్యాల: మండలంలోని పాత ముచ్చుమర్రి, సంకిరేణిపల్లె గ్రామాల్లో శుక్రవారం నూతన దేవాలయాల్లో జంబులాపరమేశ్వరి, సుంకులమ్మ విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉత్సవాల సందర్భంగా ఆయా గ్రామాల్లో భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు స్థానికులతో పాటు వివిధ గ్రామాల నుంచి కుల, మతాలకు అతీతంగా ప్రజలు తరలి రావడంతో ఆయా గ్రామాలు భక్తులతో కిటకిటలాడాయి. బీజేపీ నాయకురాలు బైరెడ్డి శబరి జంబులాపరమేశ్వరికి బోనం సమర్పించి మొక్కు చెల్లించారు. ముచ్చుమర్రి ఎస్‌ఐ నాగార్జున స్పెషల్ పార్టీ బలగాలతో బందోబస్తు చేపట్టారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

వెలుగోడు: పట్టణంలోని శ్రీ లక్ష్మీప్రసన్న వేంకటేశ్వరస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కర్నూలు, నంద్యాల ఉమ్మడి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం హోరాహోరీగా సాగాయి. పోటీలను ఆలయ కమిటీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బళ్లాని వెంకట సత్యనారాయణ ప్రారంభించారు. పోటీల్లో 27 జట్లు పాల్గొనగా సాంబవరం జట్టు విజేతగా నిలవగా రూ.20వేలు అందజేశారు. రన్నర్‌గా నిలిచిన వెలుగోడు జట్టుకు రూ.15వేల నగదు అందజేశారు. మూడో స్థానంలో సోమయాజులపల్లె జట్టుకు రూ.10 వేలు, నాల్గో స్థానంలో శివనంది జట్టు నిలవగా రూ.5వేలు అందజేశారు. బహుమతులను దాతల సహకారంతో అందజేశారు. సభ్యులు లాలం నాగార్జున, తాళ్లూరి నాగరాజు, జూటూరు నాగపుల్లయ్య, రిటైర్డు ఎంఈఓ వెంకట సుబ్బయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భ్రామరీకి లక్ష కుంకుమార్చన



లక్ష కుంకుమార్చన పరోక్ష సేవగా నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: వైశాఖ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. లక్ష కుంకుమార్చనలో భక్తుల పరోక్ష సేవగా పాల్గొనేందుకు దేవస్థానం అవకాశం కల్పించింది. శుక్రవారం నిర్వహించిన సేవలో 36 మంది భక్తులు పరోక్షసేవ ద్వారా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా అర్చకులు,వేదపండితులు ముందుగా సంకల్పం పఠించి, కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం లక్ష కుంకుమార్చన చేపట్టారు. మంగళకరమైన ద్రవ్యాలలో కుంకుమకు ఎంతో ప్రాధాన్యత ఉందని, కుంకుమ ద్రవ్యంతో అమ్మవారిని అర్చించడం విశేష ఫలదాయకమని పండితులు పేర్కొన్నారు. శ్రీశైల క్షేత్రానికి స్వయంగా విచ్చేయలేని భక్తులు వారి గోత్ర నామాలతో ఆయా ఆర్జిత సేవలను పరోక్షంగా జరిపించుకునేందుకు వీలుగా దేవస్థానం లక్ష కుంకుమార్చన ఆర్జిన పరోక్ష సేవగా నిర్వహిస్తుంది. ఈ సేవకు భక్తులు ఆన్‌లైన్ ద్వారా రూ.1016 చెల్లించాలి.

రమణీయం..రథోత్సవం



అశేషజనవాహిని నడుమ రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మిడుతూరు: స్థానిక శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి వారి రథోత్సవం అంగరంగ రమణీయంగా సాగింది. ఉదయం ఈఓ గుర్రెడ్డి ఆధ్వర్యంలో రథం ముందు రథాంగహోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వేదపండితులు సుబ్రహ్మణ్యం శర్మ, ఆలయ పురోహితులు వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 5. 30 గంటలకు ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో ఆశీనులు గావించి భక్తజనుల జయ జయ ధ్వనాల మధ్య మేళతాళాలతో, మంగళవాయిద్యాలతో రథం చుట్టూ ప్రదక్షిణ చేసి ఉత్సవమూర్తులను రథంపై అధిష్ఠింపజేయగా సర్పంచ్ జయలక్ష్మమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు పర్వత యుగంధర్‌రెడ్డి, తహసీల్దార్ సిరాజుద్దీన్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ తువ్వా శివరామకృష్ణారెడ్డి, ఉపసర్పంచ్ తువ్వా లోకేశ్వరరెడ్డి, యరభం ప్రభాకర్ రెడ్డి, తువ్వా భగీరథరెడ్డి, తువ్వా వెంకటనాగిరెడ్డి, భూమా కృష్ణమోహన్ తదితరులు రథం వద్ద ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులు చెన్నకేశవవుడి నామ జపం చేస్తూ రథాన్ని బస్టాండు కూడలి వరకు లాగి యథాస్థితికి చేర్చారు.

నేడు పార్వేటోత్సవం..

బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం ఉదయం తీర్థావళి, పూర్ణాహుతి కార్యక్రమం, సాయంత్రం 5.30 గంటలకు పారువేట ఉత్సవం నిర్వహిస్తున్నట్లు ఈఓ గుర్రెడ్డి తెలిపారు.

కొత్తపల్లి: గువ్వలకుంట్ల గ్రామంలోని ఈశ్వస్వామి తిరునాలలో భాగంగా మూడోరోజు శుక్రవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ముందుగా గ్రామపెద్దలు, ఆలయ కమిటీ సభ్యులతో కలసి ఆలయ పురోహితులు లాల్‌బహదూర్ శాస్త్రి.. ఉత్సవమూర్తులైన శివపార్వతుల విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించారు.పూలమాలలు, విద్యుదీపాలతో అలంకరించిన రథంపై ఉత్సవమూర్తులను అధిష్ఠింపజేయగా.. భక్తుల శివనామస్మరణ మధ్య రథాన్ని ముందుకు లాగారు. వేడుకను తిలకించేందుకు వివిధ గ్రామాల నుంచి ప్రజలు తరలిరావడంతో గ్రామం భక్తులతో కిటకిటలాడింది.



గువ్వలకుంట్లలో సాగుతున్న రథోత్సవం

ఘనంగా బిందె, నందికోల సేవ

మిడుతూరు: బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీ చౌడేశ్వరీ దేవీ జ్యోతి మహోత్సవాలు తొగట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో భాగంగా స్థానిక బస్టాండ్ ఆవరణంలో బిందె సేవ, నందికోల సేవా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చౌడేశ్వరీ దేవీ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్‌కు విశేషపూజలు నిర్వహించారు. అనంతరం రాత్రి 12 గంటల నుండి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ ఆలయం నుంచి జ్యోతులను ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకెళ్లారు. తొగట వీర క్షత్రియుల గురువు దివ్యజ్ఞానానందగిరి స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విశ్వమాత ఆలయంలో విశేష పూజలు

కొత్తపల్లి: నందికుంట గ్రామశివారుల్లో వెలసిన విశ్వమాత ఆలయ చతుర్ధ వార్షికోత్సవంలో భాగంగా మూడో రోజు శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపక పురోహితులు బాణాల లక్ష్మీనారాయణ ఆచారి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, శ్రీ విశ్వమాత సహిత విశ్వేశ్వర స్వామి నవవిధ పంచామృత అభిషేకములు, పతాక ఆవిష్కరణ, జపవేద పారాయణ పూర్ణహూతి హోమములు, శివపార్వతుల కల్యాణం జరిపించారు. సాయంత్రం అమ్మవారి రథోత్సవం భక్తుల జయజయ ధ్వానాల మధ్య చేపట్టారు. ముఖ్యఅతిథిగా బ్రహ్మశ్రీ డాక్టర్ కృష్ణమాచార్య గురుజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బుద్ధ పౌర్ణమి

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఆదర్శ నర్సింగ్ హోంలో శుక్రవారం బుద్ధ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. సత్యశోధక సమాజ్ అధ్యక్షుడు డాక్టర్ డి.నాగన్న ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ బుద్ధుడు ప్రకటించిన ధర్మసూత్రాలను అంబేడ్కర్, జ్యోతిరావు పూలే వంటి వారు అధ్యయనం చేశారన్నారు. ప్రజాసంఘాల నాయకులు శంకర్ గౌడ్,నరేంద్ర,వేణు పాల్గొన్నారు.